# ఐస్ ఫ్రూట్...! ఐస్ ఫ్రూట్...!!

"ఐస్‌ఫ్రూట్!... ఐస్‌ఫ్రూట్!!"

ఐస్‌ఫ్రూట్ రావుడి డొక్కు సైకిలు పక్కవీధిలో వున్నా హేండిల్ బిగించిన సీనా రేకు డబ్బా మూతతో అతను చేస్తున్న శబ్దం... తకథం అంటూ తాళంలా... 'ఐస్‌ఫ్రూట్' అనే మాట పాటలా ఉంటూ పిల్లలకి మేలుకొలుపు గీతంలా వినిపిస్తుంది. రకరకాల రాగాల్తో అరుస్తున్న అతని పిలుపు 'ఐస్కాంతం'లా ఆకర్షిస్తుంది. నోరూరించేలా పిలుస్తాడు.

"నేనొస్తున్నా పావలా రడీ చేసుకోండి పిల్లలూ" అన్నట్లు అతని చప్పుడు పిల్లల్ని పేచీ పెట్టటానికి ప్రిపేరు చేస్తున్నట్లుంటుంది!!

రావుడు వాళ్ల వీధిలోకి వచ్చేలోగా పిల్లలు పేచీ స్టార్ట్‌చేసి పెద్దవాళ్లతో గెలిచి, పావలా బిళ్లల్తో నిలబడి ఉంటారు!!

'ఎర్రరంగు ఐసు, కనకాంబరం ఐసు, తెల్లరంగు ఐసు, పచ్చరంగు ఐసు, ఆకుపచ్చరంగు ఐసు, ద్రాక్ష పండు రంగు ఐసు' అంటూ పిల్లల

చొక్కాలకీ, గౌనులకీ సూటయ్యే రంగుల్ని మేచింగు ఐసుల్లా వొప్పించి అంటకట్టే చాకచక్యం రావుడిది!

వేసవి సెలవులు రెణ్నెళ్ళూ ఇళ్లల్లో ఉండే పిల్లల్తో బాటు... పట్నాల్నుంచి సెలవులకి పల్లెటూరు వచ్చిన పిల్లలకీ... పెద్ద వాళ్లతో 'ఈ ఐస్‌ఫ్రూట్ వేళ' గందరగోళం తప్పదు!!

రోజూ ఐస్‌ఫ్రూట్ తింటే జలుబు చేస్తుందనీ, అసలవి మంచి బొబ్బతో(నీళ్లు) చేయరనీ, గొంతు ఇంత లావు వాచిపోతుందనీ ఆపరేషను చేసినా తగ్గదనీ... ఎన్ని రకాల బెదిరించినా ఐసు కొని తీరాల్సిందే.

పొద్దుట పాలు తాగటానికి పేచీ పెట్టి... మధ్యాహ్నం ఐసు కొనటానికి బేరం పెట్టి సాధించుకున్న గడుసుపిల్లలు, అన్నం తినటానికి మారాం చేసి, ఐసుకొని పెడతానని ఒట్టేయించుకున్న గడుగ్గాయిలూ... అమ్మ, అమ్మమ్మ ఏదైనా పని చెబితే క్యాష్ (పావలా) ఎడ్వాన్స్‌గా తీసుకునే లంచాల మారీలు, తాతగారి జేబులోంచో, బామ్మ పోపుల పెట్టెలోంచో చిల్లర పైసలు ఎత్తుకెళ్లే దొంగ కృష్ణుళ్లూ.. ఇలాటి పిల్లల్తో ప్రతీ వీధి కోలాహలంగా వుంటుంది రావుడి సైకిల్ మోత వినపడేవేళ. అది ఐస్ ఫ్రూట్ వేళ-

రావుడి రాక పిల్లలకి ఎంత సరదానో పెద్దవాళ్లకి అంత చిరాకు. మొహంమీదే రావుణ్ణి తిట్టిపోస్తూ వారానికొక్కసారి గానీ ఈ వీధిలోకి రావద్దని హెచ్చు స్వరంతో హెచ్చరిస్తారు. రావుడికి ఇదంతా మామూలే. ఇరవై ఏళ్లుగా వేసవి కాలం వస్తే ఐస్ డబ్బా, వర్షాకాలంలో మొక్కజొన్నలూ, ఇంకోప్పుడు రేగిపళ్లూ ఇలా సీజన్‌కి తగిన వ్యాపారాలు చేస్తూ తనకి ఎక్కడ బేరం దొరుకుతుందో అనుభవం మీద గ్రహించిన జీనియస్ రావుడు! తను అమ్మదల్చుకున్న వీధిలో ఐస్‌ఫ్రూట్ అమ్మే వెళ్తాడు.

ఎవరైనా పిల్లలు పక్క వీధిలోకొచ్చి, డబ్బులిచ్చి 'తెల్ల ఐస్‌ఫ్రూట్ ఇమ్మంటే' రావుడు ఇట్టే పసిగట్టేస్తాడు. ఆ డబ్బులు దొంగ డబ్బులనీ అందుకనే, నోరు రంగు అవకుండా 'తెల్ల' ఐస్‌ఫ్రూట్ అడుగుతున్నాడని!! తెల్ల ఐస్‌ఫ్రూట్లు అయిపోయాయని అబద్ధం ఆడేస్తాడు. ఇలా దొంగతనం మంచిది కాదని చెప్పీ చెప్పకుండా నీతి చెప్పేస్తాడు. ఆ పిల్లల ఇంటి ముందే ఐస్ అమ్ముతాడు. పావలా తీసుకుని చివాట్లు తింటాడు.

పేచీ పెట్టి కొనిపించుకునే గట్టి పిండాలు గెలిచేంతవరకూ... ఆ వీధిలోనే నిలబడి రేకుమూత తాళం వేస్తూ ఐస్‌ఫ్రూట్ రాగాలు వినిపిస్తూ రెచ్చగొడుతుంటాడు.

రావుడి సైకిలు కరణంగారి వీధిలోకి వచ్చింది!

కరణం గారికి ఇంటెడు సంతానం. ముగ్గురు కూతుళ్లూ, ఇద్దరు కొడుకులూ. మొత్తం డజను మంది మనవళ్లు. చిన్నా చితకా ఇద్దర్ని తీసేసినా పదిమంది ఐస్‌ఫ్రూట్ కోసం గోలెట్టే పిల్లలుంటారు!! పది పావలాలు నిఖార్సుగా వస్తాయి. పొరపాటున వాళ్లెవరైనా నిద్దర్లో ఉన్నా వాళ్లు లేచొచ్చేదాకా రాగతాళాలు కొనసాగిస్తాడు. తన బేరం అయితేగాని మరో వీధికి వెళ్లడు.

కరణంగారి పక్కిల్లు ఆయనగారి తమ్ముడిది. తమ్ములుంగారికి లింగూ లిటుకూమని ఇద్దరే పిల్లలు! ఆ ఇద్దరికీ వంశాంకురం ఒక్కడే రవి. వాడికి కాస్త కరిగిపోయిన ఐస్‌ఫ్రూట్ ఫ్రీగా ఇచ్చి కరణంగారింటికి తోలేస్తాడు-

ఇంక చూడండి... రవి కరణంగారింటికి వెళ్లి ఐస్‌ఫ్రూట్ చప్పరిస్తుంటే అప్పటికే ఆరున్నొక్కరాగంతో ఉన్న పిల్లగోల ఉచ్ఛస్థాయికి

వెళ్తుంది. రవిని తిట్టాలేరు, కొట్టాలేరు! చచ్చినట్టు వీధి చివరన ఉన్న రావుణ్ణి పిలిచి అందరికీ ఐస్‌ఫ్రూట్ కొనిపెడతారు. రావుడేసిన రవి బాణం ఆరోజు కూడా గురి తప్పలేదు. కరణంగారమ్మాయి కమల విధి లేక వీధిలోకొచ్చి రావుణ్ణి పిలిచింది. రావుడు వచ్చాడు. పిల్లలు చుట్టుముట్టారు. కావల్సిన రంగులవి కోరుకుంటున్నారు. పిల్లల ముందు ఓడిపోతున్న కమల ఉక్రోషంగా "ఈ వీధిలోకి రావద్దన్నానుగా! పిల్లలు నీ దిక్కుమాలిన ఐస్‌లు తిని రొంప, దగ్గు వచ్చి, రోగాలూ రొష్టులూ తెచ్చుకుంటున్నారు. ఏవేవో మురికి నీళ్లతో పాటు రంగులతో మీరీ ఐస్‌ఫ్రూట్‌లు తయారుచేస్తారు. దాని వల్ల పిల్లలకి ఏదన్నా అవుతుంది నాయనా... అని ఎన్నిసార్లు చెప్పాలి?'' అంటూ రెచ్చిపోయింది.

రావుడు చిన్నగా నవ్వుతూ "నీకేంటమ్మా డాక్టర్‌గారి పెళ్లానివి-మందులన్నీ పెట్లో పెట్టి తెచ్చుకొస్తావ్. నేను పిల్లలకి ఐస్ ఇస్తాను. మీరు తర్వాత మందు బిళ్లలు ఇయ్యండి!'' అన్నాడు.

తోకతొక్కిన తాచులా బుస్సు మంది కమల.

"పెద్దవాడివయ్యావు. నీకూ పిల్లలూ, మనవలూ ఉంటారు. వాళ్లకేదైనా అయితే నువ్వెంత కంగారు పడతావు? ఈ పాడైసుల వల్ల గొంతువాచి టాన్సిల్స్ వస్తే ఆపరేషన్ చేయాలి తెల్సా!!''

"తెల్సమ్మా. నేను మా మనవడికి మీ కాకినాడొచ్చి ఆపరేషన్ చేయించాను! సులాగ్గానే ఉన్నాడు. అప్పటినుంచీ ఈ ఎదవ ఐస్‌ఫ్రూట్ కావాలని గోలచేస్తే, ఆరు రూపాయలెట్టి అట్టడబ్బాలో ఐస్‌క్రీము కొనిపెడుతున్నాను. నువ్వయినా, నేనైనా, పిల్లల ముచ్చట తీర్చాలి గదమ్మా'' అన్నాడు.

కమలకి జవాబేమీ దొరకలేదు. కానీ కోపం దిగలేదు.

"మా నాన్నతో చెప్పి నిన్నీవీధికి రాకుండా చేస్తానుండు..." అంటూ హెచ్చరించింది.

రావుడు ప్రశాంతంగా నవ్వుతున్నాడు. "ఒక్కటడుగుతాను చెప్పండమ్మా... మీ గెడ్డం కింద ఆ మచ్చేంటి?" అన్నాడు.

కమల వాగ్ధాటి ఆగిపోయింది. కోపంగా ఉన్న ఆమె మొహంలో సన్నటి చిరునవ్వు మొదలైంది.

చిన్నప్పుడు ఈ ఐస్ సైకిల్ రావుడు రాగానే ఎగిరి గంతేసేది. ఓసారి అతను వెళ్లిపోతాడనే ఆత్రం కొద్దీ పరుగెట్టుకెళ్తూ బోర్లా పడింది. గెడ్డం పగిలి నాలుగు కుట్లు పడ్డాయి. చందమామ లాంటి ముఖానికి చక్కని మచ్చ మిగిలింది.

అదే రావుడు- అదే సైకిల్- అదే డబ్బా- అదే తాళం- అదే పిలుపు. అప్పుడు తను ఐస్‌ఫ్రూట్ కోసం పెట్టిన పేచీ అంతా గుర్తొచ్చింది కమలకి.

రావుడికేసి చూసింది. జుట్టు రాలిపోయింది. తెల్లగెడ్డం వచ్చింది. చిన్నప్పుడు ఎలా నవ్వేవాడో ఇప్పుడూ అలాగే నవ్వుతున్నాడు.

"నువ్వు పడ్డ సర్దాలూ, సంతోషాలూ పిల్లలు పడకూడదామ్మా? వాళ్లకి జలుబొస్తే, జబ్బొస్తే చూసుకోడానికి పెద్దోళ్లున్నాం. మందులూ ఉన్నాయి. ఇప్పుడు ఆళ్లని ఏడిపిస్తే... ఏడ్చేడ్చి గొంతు వాచిపోద్ది. నువ్వేమో నా ఐస్‌ఫ్రూట్ తింటం మూలాన్నే వాచిందని కొత్త కథ చెప్తావు" రావుడు మాట్లాడుతూ మాట్లాడుతూ పిల్లలందరికీ ఐస్‌ఫ్రూట్స్ అందించాడు. కమల చిన్నపిల్లలా "నాకు కూడా ఓటి ఇయ్యి- ఎర్రదియ్యి- తమలపాకులేసుకున్నట్లు నాలిక పండాలి" అంది.

రావుడు పిల్లల డబ్బులన్నీ తీసుకున్నాడు- కమలకి మాత్రం ఫ్రీ.

